క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నేతలు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన మేడపాటి షర్మిలారెడ్డి, అనిల్ రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఆమె భర్త అనిల్ రెడ్డి కలిశారు.

లక్ష్మీనరసింహం సేవలు అభినందనీయం



లక్ష్మీనరసింహం దంపతులను సత్కరిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ అతే లక్ష్మీ నరసింహం సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం డీఎల్‌డీవో పి.వీణాదేవి అన్నారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహం, విజయలక్ష్మి దంపతులను డీఎల్‌డీవో వీణాదేవి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ లక్ష్మీనరసింహం విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారన్నారు.

రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సీపీవో అప్పలకొండ

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూశాఖలోని జూనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ ప్రారంభమైంది. పంటకోత అంచనా సర్వే, వ్యవసాయ గణనపై ఈ నెల 8వ తేదీ వరకూ వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అర్థగణాంక అధికారి (సీపీవో) ఎల్.అప్పలకొండ మాట్లాడుతూ సర్వేపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో పదోన్నతుల్లో భాగంగా సర్వే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి అన్నారు.

వర్క్‌బుక్స్ పరిశీలన

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి విద్యార్థుల వర్క్‌బుక్స్ కరెక్షన్ విషయంలో అత్యంత శ్రద్ధ చూపాలని రాజమహేంద్రవరం డీవైఈవో ఈవీబీఎస్ నారాయణ అన్నారు. స్థానిక జన్ను మహంతి బంగారయ్య ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రఫుల్ల చంద్రరాయ్ జయంతి

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు బి.వెంకట్రావు, ఎం.పద్మజ, ఎన్.బేబీ నిర్మల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రఫుల్ల చంద్రరాయ్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. విజేతలకు రసాయన శాస్త్ర విభాగాధిపతి చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమానికి ఎం.శాంతకుమారి సమన్వయకర్తగా వ్యవహరించారు.

సౌత్ జోన్ పరిధిలో పోలీస్ యాక్ట్ 30 అమలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సౌత్ జోన్ పరిధిలో ఈ నెల 31 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ అంబికా ప్రసాద్ శుక్రవారం తెలిపారు. దీని పరిధిలో రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదన్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

కోర్టు తీర్పుపై హర్షం

కడియం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వేమగిరి పాతపేటలో స్థానిక నాయకులు, యువత బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

క్రీడామహేంద్రి





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు (ఫైల్), జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో వెండి పతకం సాధించిన పూజిత శృతి

- క్రీడాపోటీలకు వేదికగా రాజమహేంద్రవరం
- పలు టోర్నమెంట్ల నిర్వహణ
- సత్తా చాటుతున్న నగర క్రీడాకారులు

ప్రకాశం నగర్: చారిత్రక రాజమహేంద్రవరం క్రీడా రాజధానిగా మారుతోంది. జిల్లా కేంద్రమైన నగరంలో తరచూ పలు క్రీడా పోటీలు జరుగుతున్నాయి. వీటిలో రాష్ట్ర స్థాయి పోటీలు కూడా ఉంటున్నాయి. దీంతో క్రీడా పోటీలకు నగరం వేదికగా మారుతోంది. ఇటీవల నగరంలోని చెరుకూరి కన్వెన్షన్ హాలులో పదో ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ ఉషూ చాంపియన్ షిప్ జరిగింది. బాలురు, బాలికల విభాగాలలో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 112 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సుమారు రెండు రోజుల పాటు సుమారు 10 విభాగాలలో పోటీలు నిర్వహించారు. వీటిని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ప్రారంభించారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విజేతలు కోయంబత్తూర్‌లో జరగనున్న జాతీయ పోటీలలో పాల్గొంటారు.

స్టేట్ ర్యాంకింగ్ టీటీ పోటీలు

నారాయణపురంలోని ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సుమారు మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పది టేబుళ్లపై 25 మంది ఎంపైరింగ్ సిబ్బందితో మొత్తం 12 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి నగదు బహుమతి, ట్రోఫీలు అందజేశారు. ప్రతిభ చూపిన వారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

వసతులు అంతంతమాత్రం

నగరంలో పెద్ద ఎత్తున క్రీడా పోటీలు జరుగుతున్నా కొన్ని మైదానాలలో మాత్రం పూర్తిస్థాయిలో వసతులు ఉండడం లేదు. ఆర్ట్స్ కళాశాల, స్టేడియం, ఎస్‌కేవీటీ, లాలాచెరువు పోలీస్ మైదానాలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించి, గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చింది. గత ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో క్రీడాకారుల ప్రతిభకు పదునుపెట్టినట్లు అయ్యింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో క్రీడల ఊసే లేదని పలువురు పెదవి విరుస్తున్నారు.

నగర విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం విద్యార్థులు చదువులో పాటు క్రీడలపై కూడా ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు. వివిధ పోటీలలో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. జాతీయ వేదికలపై కూడా సత్తా చాటుతున్నారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ ఉషూ లీగ్ (సౌత్ జోన్)లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థి పూజిత శృతి ప్రతిభ కనబరిచి వెండి పతకం సాధించింది. ఆమె డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర అభినందించారు.

శుద్ధమైన తాగునీరు అందించాలి



వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందజేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి వరద దృష్ట్యా తగు మోతాదులో క్లోరిన్, పటిక కలుపుతున్నామన్నారు. ప్రతిరోజూ వార్డులలో పైపులైను చివరి పాయింట్ల వద్ద నీటి నాణ్యత పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్సా ఆలీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చంద్రశేఖర్, ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీధర్ ఉన్నారు.

గ్రామాల మీదుగా బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తోందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాజానగరం మండలంలోని పలు గ్రామాల మీదుగా ద్వారపూడి వెళ్లేందుకు సిద్ధం చేసిన బస్ సర్వీసుకు శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల పూజలు నిర్వహించగా, డీపీటీఓ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజానగరం మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలపగా తక్షణమే బస్సు సర్వీసును నడిపేందుకు అంగీకరించారన్నారు. డీపీటీఓ షర్మిల అశోక మాట్లాడుతూ ఈ బస్సు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి హౌసింగ్ బోర్డు కాలనీ, దివాన్ చెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం, పాత తుంగపాడు, కొత్త తుంగపాడు గ్రామాల మీదుగా ద్వారపూడి వరకూ నడుస్తుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



నరేంద్రపురంలో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజానగరం, కోరుకొండ మండలాలలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను విజయవాడ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. నరేంద్రపురంలో నాలుగు ఎకరాలలోని ప్రగడ రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, అక్కడ పండిస్తున్న బీర, కాకర, పొట్ల, దొండ, పసుపు, కీరదోస, ఆనప, మున్నగు పలు రకాల కూరగాయల సాగును, వాటికి ఉపయోగిస్తున్న సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. కోతకు వచ్చిన తరువాత వాటిని రాజమహేంద్రవరంలోని గ్రేటెడ్ కమ్యూనిటీస్ కుటుంబాలకు విక్రయిస్తున్నారు. అలాగే నందరాడలో గుత్తుల సూర్యనారాయణ నిమ్మతోట, కొబ్బరి తోట, ఏటీఎం మోడల్ కూరగాయల సాగును పరిశీలించారు. ఈ సమయంలో వ్యవసాయ విద్యార్థులకు తలెత్తిన పలు అనుమానాలను రైతుల ద్వారానే నివృత్తి చేయించి, అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. కోరుకొండ మండలం నిడిగట్లలోని వేమగిరి అన్నపూర్ణ పొలంలోని మామిడి తోటలో అంతర పంటలుగా ప్రకృతి వ్యవసాయ విధానాలతో చేస్తున్న కూరగాయల సాగును కూడా సందర్శించారు. అనంతరం కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని కూడా సందర్శించారు. అక్కడి వరిసాగు క్షేత్రాలు, ఏడాది పొడవునా పండించే ఏటీఎం మోడల్ కూరగాయల సాగు గురించి కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా మేనేజర్ బి.తాతారావు, సహాయాధికారి వలీ వివరించారు.

బళ్లారి రాఘవ జీవితం స్ఫూర్తిదాయకం



బళ్లారి రాఘవ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వ్యవసాయ కళాశాల డీన్ శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: న్యాయవాది వృత్తిలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన బళ్లారి రాఘవ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో శుక్రవారం బళ్లారి రాఘవ (తాడిపత్రి రాఘవాచార్యులు)144వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ బళ్లారి రాఘవ బాల్యం నుంచే నటనపై ఆసక్తి చూపేవారని, పలు నాటకాల్లో నటించారన్నారు. చదువులోనూ ఎంతో ప్రతిభను చూపేవారన్నారు. కాగా.. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హెచ్.సునీత నేతృత్వంలో కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించగా విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ ర్యాలీ



రాజవోలు హైస్కూల్లో ఒలింపిక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు శుక్రవారం ఒలింపిక్ ర్యాలీలు నిర్వహించారు. బొమ్మూరు గిరిజన బాలికోన్నత పాఠశాలలో, రాజవోలు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణాల్లో ఈ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. పారిస్‌లో ఒలింపిక్ క్రీడలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో ఆసక్తి పెంచడానికి, దేశం తరఫున పాల్గొన్న క్రీడాకారులకు మద్దతు తెలపడానికి ఈ ర్యాలీలు నిర్వహించినట్టు ఇన్‌చార్జి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్.మోహన్ దాస్ తెలిపారు. కార్యక్రమంలో యోగా కోచ్ బీవీజీ నాగేంద్రన్, ప్రధానోపాధ్యాయులు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



పొట్టిలంకలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో కనకవల్లి



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక

కడియం: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలను తప్పక పట్టించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ కనకవల్లి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పొట్టిలంకలో సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కనకవల్లి మాట్లాడుతూ తల్లి ముర్రుపాలే మొదటి టీకాగా పనిచేస్తాయని, వీటిని బిడ్డ పుట్టిన గంటలోపే పట్టడం ద్వారా రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యే వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. అనంతరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కలిదిండి విశాలాక్షి, పంచాయతీ కార్యదర్శి తాతారావు, జీఎంఎస్ కె.రేష్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

రాజమహేంద్రవరం రూరల్: బిడ్డకు తల్లిపాలు అమృతమని ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక అన్నారు. బొమ్మూరు వెంకటగిరికొండ అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక, ఏఎన్ఎం బేబీ శ్రీదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, హెల్పర్ అనిత, ఆశాలు జయలక్ష్మి, శుభలక్ష్మి పాల్గొన్నారు.

‘డైట్’ ఘటనపై ప్రభుత్వం స్పందించాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ విజృంభణ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో చదువుతున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు లెక్చరర్ బాలరాజు, పీఈటీ వీరభద్రరావులను వెంటనే అరెస్టు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ విజృంభణ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ.సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ బృందం డైట్‌కి వెళ్లి అక్కడ బాధితులతో మాట్లాడింది. జరిగిన ఘటనకు సంబంధించి వివరాలను తెలుసుకుంది. అనంతరం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ సెంటర్‌లో బృంద సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో జరిగిన ఈ ఘటనను ప్రిన్సిపాల్ దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అన్ని వర్గాలనూ అలరించే ‘కమిటీ కుర్రోళ్లు’



చిత్ర యూనిట్‌తో దర్శకుడు యదువంశీ, నటి నిహారిక తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అన్ని వర్గాలనూ అలరించేలా గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో కమిటీ కుర్రోళ్లు సినిమాను తెరకెక్కించినట్లు నిహారిక కొణిదెల ప్రొడక్షన్స్ అధినేత, నటి నిహారిక, చిత్ర దర్శకుడు యదువంశీ చెప్పారు. కొణిదల పద్మజ నిర్మించిన ఈ చిత్రంలో అందరూ కొత్త నటులే కావడం విశేషం. కమిటీ కుర్రోళ్ల చిత్రం ఈ నెల 9న వరల్డ్ వైడ్ థియేటర్లలో సందడి చేయనుంది. ప్రమోషన్ వర్క్‌లో భాగంగా చిత్రబృందం శుక్రవారం రాజమహేంద్రవరం విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానిక హోటల్ షెల్టాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు యదువంశీ మాట్లాడుతూ రైటర్‌గా పనిచేసిన తాను ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. నిహారిక మాట్లాడుతూ సినిమాలో అందరూ కొత్తవాళ్లు అయినప్పటికీ బాగా నటించారన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని భావిస్తున్నామన్నారు. నటి తేజస్వి రావు మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన తనకు ఈ మూవీలో అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.

కోరుకొండ హైస్కూల్‌కు జాతీయ గుర్తింపు



అటల్ మారథాన్‌లో సత్తా చాటిన కోరుకొండ హైస్కూల్ విద్యార్థులు

మధురపూడి: అటల్ మారథాన్‌లో కోరుకొండ హైస్కూల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కోరుకొండ ప్రభుత్వోన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. స్మార్ట్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పరిశోధనలో వీరు తయారు చేసిన నమూనా పత్రానికి జాతీయ స్థాయిలో 124వ స్థానం దక్కింది. ఈ సందర్భంగా యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యునెసెఫ్) రాష్ట్ర స్థాయి కన్సల్టెంట్ టి. సుదర్శన్ స్కూలును సందర్శించి, విద్యార్థులను అభినందించారు. స్కూల్ హెచ్ఎం ఎంఎస్ మణికుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సత్యానంద్, సుబ్రహ్మణ్యం, రామారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

విచారణకు ఆదేశాలు

సీతానగరం: రఘుదేవపురం పంచాయతీలో 2014–2019 మధ్య కాలంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఫిర్యాదుపై పంచాయతీరాజ్ కమిషనర్ స్పందించి, విచారణకు ఆదేశించారని చిన కొండేపూడికి చెందిన న్యాయవాది చిడిపి నకులసురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విచారణ నివేదికను పంచాయతీరాజ్ కార్యాలయానికి పంపాలని కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశించారన్నారు.

శాకంబరీ.. నమోస్తుతే..



శాకంబరిగా కడియంలోని కనకదుర్గమ్మ

కడియం: ఆషాడ మాసంలోని శుక్రవారం సందర్భంగా కడియంలోని శ్రీదేవి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ కూరగాయల వ్యాపారులు దివంగత దొడ్డ శ్రీనివాస్ కుమారులు, దొడ్డ బుజ్జి, కడియం కూరగాయల వ్యాపారులు సమకూర్చిన సుమారు రెండు టన్నుల కూరగాయలు, పండ్లతో అమ్మవారి విగ్రహంతో పాటు గర్భాలయాన్ని అలంకరించారు. అర్చకుడు రంగనాథ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ వారిని శాకంబరిగా అలంకరించారు.



కడియపులంక ముసలమ్మతల్లి

సినిమాలు



శ్యామల	రాయన్
సూర్యమినీ	రాయన్
సూర్యప్యాలెస్	బడ్డీ
స్వామి	శివంభజే
శివజ్యోతి	అలనాటి రామచంద్రుడు, ఏవరేజ్ స్టూడెంట్ నాని
అనుశ్రీ	శివంభజే
రాజా	తిరగబడరాసామి
రంభ	ఎటో వెళ్లిపోతుంది మనసు, పురుషోత్తముడు
ఊర్వశి	ఉషాపరిణయం
మేనక	విరాజ్
కుమారి	తిరగబడరాసామి
అప్సర	డెడ్‌పూల్ అండ్ వోల్వెరిన్
అశోక నామవరం	కల్కి2898ఏడీ
వీఎస్ మహల్ ధవళేశ్వరం	శివంభజే
మురళీకృష్ణ కడియం	బడ్డీ, రాయన్
వెంకటసూర్య	శివంభజే